## క్లుప్తంగా

### ఆరిలోవ సీఐగా సోమశేఖర్ బాధ్యతల స్వీకరణ



ఆరిలోవ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సోమశేఖర్

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ కొత్త సీఐగా జి.సోమశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు సీఐగా పనిచేసిన ఇమాన్యుయేల్‌రాజును సిటీ వీఆర్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన సోమశేఖర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

### నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్ కుమార్

ఎంవీపీ కాలనీ: నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమని త్రీటౌన్ ఎస్ఐ ఎ.సంతోష్‌కుమార్ కోరారు. నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని మద్దిలపాలెం, సంపత్ వినాయక ఆలయం, సీబీఐ కాంపౌండ్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. పండగలకు ఊర్లో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారు కనిపిస్తే పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు.

### మోదీ పాలనలో అభివృద్ధి శూన్యం




సమావేశంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: బీజేపీ పాలనలో దేశం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జనవరి 17 నుంచి 30 వరకు జగనన్న ఇంటి లబ్ధిదారులను కలిసి అర్జీలపై సంతకాల సేకరణ, ఫిబ్రవరి 3న లబ్ధిదారులతో జిల్లా కేంద్రాల్లో సదస్సులు, ఫిబ్రవరి 22న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు, జనవరి 23,24 తేదీల్లో ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నాలు, 25న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, 30న కార్మికులు తలపెట్టిన పోరాటానికి సంఘీభావం, జనవరి 14న జీవో నంబర్ 1 భోగి మంటల్లో తగులబెట్టడం, 26న రాజ్యాంగ పరిరక్షణ దినంగా పాటించాలని, జనవరి 30న లౌకిక వాద పరిరక్షణ దినంగా పాటించాలని తీర్మానించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### పలు డిమాండ్లకు అంగీకారం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశాల మేరకు ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకట్రావు, సుధాకరరావుతో జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సుబ్బారావు నాయకత్వంలో గురువారం చర్చలు జరిగాయి. చర్చల్లో ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ హెల్పర్, టర్న్‌కాక్‌లకు సెమిస్కిల్డ్ వేతనం రూ.18,500 చెల్లించేందుకు, 60 ఏళ్లకు పదవీ విరమణ పొందిన, చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించేందుకు, ఇంకా పలు డిమాండ్లకు సీఈ అంగీకరించారని యూనియన్ నాయకులు వెంకట్‌రెడ్డి, సుబ్బారావు తెలిపారు. చర్చల్లో యూనియన్ నాయకులు శంకర్‌రెడ్డి, ఆదినారాయణ, మోహన్‌రావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుడి జీవితం ఆదర్శనీయం



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు



వివేకానందనగర్‌లో పేదలకు దుప్పట్లు అందిస్తున్న కాలనీ పెద్దలు, కార్పొరేటర్ రోహిణి

ఏయూ క్యాంపస్: ప్రపంచ దేశాలలో యువతకు స్వామి వివేకానంద జీవితం ఆదర్శంగా నిలుస్తోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం ఉదయం ఏయూ పరిపాలనా భవనంలో వివేకానంద చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ మేధస్సు నిజమైన సంపదని, జ్ఞానం అనంతమైన గౌరవాన్ని, గుర్తింపును ఇస్తుందని వివేకానందుని జీవితం తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పాలక మండలి సభ్యులు పి.ఏసుపాదం, దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, ఆచార్య డి.సూర్యప్రకాశరావు, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, ఆచార్య రాజమాణిక్యం, ఆచార్య సిహెచ్.ఆశా ఇమ్మానియల్ రాజు, పలువురు విదేశీయులు పాల్గొన్నారు.

**ఎంవీపీ గ్రంథాలయంలో..**

ఎంవీపీ కాలనీ: స్థానిక నగర శాఖ గ్రంథాలయంలో స్వామి వివేకానందుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందంటూ పలు సందర్భాల్లో స్వామి వివేకానంద వెల్లడించారన్నారు. యువతలో స్ఫూర్తినింపే రచనలు, ప్రసంగాలు చేశారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికలపై ఆవిష్కరించి దేశ ఖ్యాతి పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, గ్రంథాలయ పాఠకులు రామారావు, డాక్టర్ రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు దుప్పట్ల పంపిణీ**

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు టీఐసీ పాయింట్ దరి మయూరినగర్‌లో గురువారం స్థానిక పార్కులో మయూరినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతి ఉత్సవాలు నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మాట్లాడుతూ వివేకానందుని ఆశయాలు, ఆయన జీవిత విశేషాలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానికుల సహకారంతో పేదలకు దుప్పట్లు, పండ్లను కార్పొరేటర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కన్నేటి సుబ్బారెడ్డి, కె.మోహనరావు, హుస్సేన్, సూర్యారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరహాలరావు, కృష్ణారావు, నాయుడు పాల్గొన్నారు.

# పేదలకు జగనన్న ప్రభుత్వం భరోసా

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ఎస్‌బీజీ నగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: పేద, మధ్య తరగతి కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు ఎస్‌బీజీ నగర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాలు అందజేశారు. ఏయే సంక్షేమ పథకాలు ద్వారా ఏ విధమైన లబ్ధి పొందారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ పథకాల ద్వారా లబ్ధి పొందిన పేదల అభివృద్ధిని చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు పాలన అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేయలేదని గుర్తు చేశారు. కింద స్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి సచివాలయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ జగ్గపిల్లి అప్పలరాజు, జనపాన రజని, ఒమ్మి శ్రీను, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

# గురుకులంలో అద్భుత చిత్రాలు



గురుకులంలో చిత్రాలు ఏర్పాటు చేసిన గది



విద్యార్థులు వేసిన వివిధ చిత్రాలు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులు చిత్ర లేఖనంలో ప్రతిభ చూపుతున్నారు. ఇక్కడ కొలువుదీరిన విభిన్న చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. రకరకాల పువ్వులు, పక్షులు, జంతువులతో పాటు పల్లె అందాలు, ఉదయించే సూర్యుడు, వెన్నెలలో చంద్రుడు, గంగిరెద్దులు ఆడించడం, రైతులు పొలం పనులకు వెళ్లడం, జాలర్ల చేప వేట.. ఇలా చిత్రాలు ఔరా అనిపిస్తున్నాయి. ఈ చిత్రాలను ఇక్కడి ఉపాధ్యాయులు చార్టులపై అంటించి ఓ గదిలో ఎగ్జిబిషన్ మాదిరిగా ఏర్పాటు చేశారు. గురుకులానికి వెళ్లిన అతిథులు, అధికారులు ఈ గదిలోని చిత్రాలను చూసి అబ్బురపడుతున్నారు. విద్యార్థులను అభినందిస్తున్నారు.

# 26న ఏయూలో జ్ఞాన సరస్వతి మహాయజ్ఞం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఈ నెల 26న జ్ఞాన సరస్వతి మహాయజ్ఞం నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. విరాట్‌హిందు సంఘ్, వాసవీ క్లబ్ విశాఖ కపుల్స్, అట్లూరి నారాయణరావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాయి. 26వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలమాంబ ఆలయం వద్దనున్న ఏయూ మైదానంలో 108 హోమ గుండాలతో మహాయజ్ఞం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు స్వహస్తాలతో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం జరగనుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆనందాశ్రమ పీఠాధిపతులు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, విరాట్ హిందూ సంఘ్ అధ్యక్షుడు కె.రామచంద్రమూర్తి, డాక్టర్ జి.సువర్ణకుమార్, డాక్టర్ సతీష్, ఉమా శంకర్, డి.శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 99511 79500, 8897343889 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# రైతుబజార్లలో గుమ్మడి, చెరకు విక్రయాలు



రైతుబజార్‌కు చేరిన తీపి గుమ్మడి కాయలు



విక్రయాలకు సిద్ధంగా ఉంచిన చెరకు గడలు

ఏయూ క్యాంపస్: రైతుబజార్‌లో గుమ్మడి, చెరకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సంక్రాంతి రోజున వంటలో గుమ్మడి వినియోగించడం ఎక్కువగా ఆనవాయితీ. అదే విధంగా పితృదేవతలకు ప్రతీకగా దేవాలయాలలో ఇచ్చే స్వయంపాకం(పాత్రల్లు)లో గుమ్మడి తప్పనిసరిగా ఉంటుంది. దీంతో భోగి రోజు నుంచి గుమ్మడి కాయ ముక్కలు అధికంగా విక్రయాలు జరుగుతాయి. ఈ మేరకు రైతులు పెద్ద సంఖ్యలో గుమ్మడి కాయలు రైతుబజార్‌కు తీసుకువచ్చారు. అదే విధంగా పండగ రోజుల్లో పూజకు చెరకు గడలను కూడా వినియోగిస్తారు. దీంతో పెద వాల్తేరు రైతుబజార్‌లో పెద్ద సంఖ్యలో ఎర్రని చెరకు గడలు, గుమ్మడి కాయలు అందుబాటులో ఉన్నాయి. గుమ్మడి కాయను ముక్కలుగా కోసి రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

# క్రీడలతో శారీరక దృఢత్వం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

ఆరిలోవ: శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని ఆంధ్రా మెడికల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు అన్నారు. శ్రీకాశ్యప్ విద్యా సంస్థలు డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు విశాలాక్షినగర్‌లో కైలాసగిరి పోలీస్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ గురువారం ముగిసింది. ఈ మీట్‌లో అథ్లెటిక్స్, కబడ్డీ, క్రికెట్, త్రోబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎం.ఎస్.ఎన్.పాత్రుడు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ టి.ఆర్.ఎస్.వర్మ, ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.ఎస్.రవి పాల్గొన్నారు.

# సాత్విక జీవనమే.. ప్రాక్పశ్చిమ సమ్మేళనం



నావాణి సంచికను ఆవిష్కరిస్తున్న సీహెచ్ఎస్ఎన్ రాజు, కృష్ణమోహన్, బీఆర్‌కే రాజు

దాబాగార్డెన్స్ : సనాతన ధర్మం, పరమ గురువుల బోధనల ఆధారంగా జీవించడమే ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమని జగద్గురు పీఠం భౌగోళిక అధ్యక్షుడు కె. గురుప్రసాద్ పేర్కొన్నారు. గురుపూజోత్సవాల్లో భాగంగా అకోశా హాల్లో జగద్గురు పీఠం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఈకే, మాస్టర్ పార్వతీ కుమార్ బోధనలకు 26 దేశాల్లో 65 బృందాలు ప్రభావితమై యోగ జీవనాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. సంస్థ భౌగోళిక కో ఆర్డినేటర్, స్విట్జర్లాండ్ దేశీయుడు బుడ్జర్ మాట్లాడుతూ వివిధ భాషల్లోకి పరమగురువుల జ్ఞానాన్ని పంచిపెట్టి ఆధ్యాత్మికతను పెంపొందింప జేయడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రీస్ దేశీయుడు హెన్రీ మాట్లాడుతూ మాస్టర్ ఈకే, మాస్టర్ కేపీతో పరిచయం ఏర్పడిన కారణంగా తనకు యోగపరమైన జీవన విధానం లభించిందన్నారు. కార్యక్రమంలో స్విట్జర్లాండ్ వనిత డాక్టర్ సెబీనా, స్పెయిన్ దేశీయుడు మైగేల్, సంస్థ అధ్యక్షుడు కెఎస్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ మూర్తి, సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

**నావాణి స్వర్ణోత్సవ సభ..**

జ్ఞానాన్ని సాధకులకు అందించడానికి మాస్టర్ ఈకే 1972లో నావాణి మాసపత్రికను నెలకొల్పారని జగద్గురు పీఠం సలహా మండలి సభ్యుడు సీహెచ్ఎస్ఎన్ రాజు చెప్పారు. 62వ గురుపూజోత్సవాల్లో గురువారం నావాణి దర్శన మాసపత్రిక స్వర్ణోత్సవ సభను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పసుమర్తి కృష్ణమోహన్, బీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా 28వ పాశుర విన్నపం



పూజలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ: సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 28వ పాశుర విన్నపాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి నీరాట్టోత్సవంలో భాగంగా భక్తులు సమర్పించిన పసుపు కొమ్ములను దంచి అమ్మవారికి మంగళస్నానం చేయించారు. అమ్మవారిని పట్టు పీతాంబరాలతో అలంకరించి పెండ్లి కుమార్తెను చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: సహస్రాది తులసీ దళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వి. రాంబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సంక్రాంతి బొమ్మల కొలువు



ఏర్పాటు చేసిన సంక్రాంతి బొమ్మల కొలువు

మద్దిలపాలెం: ఆసరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైశాఖీ అపార్ట్‌మెంట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సంక్రాంతి బొమ్మల కొలువు ఆకట్టుకుంటుంది. వరుసగా 25వ ఏటా బొమ్మల కొలువు ఏర్పాటు చేసినట్టు ట్రస్ట్ ప్రతినిధి చెరుకూరి సునీత తెలిపారు. ఆధునికతో సంప్రదాయంగా సంక్రాంతి జరుపుకోవడం మరిచిపోకుండా ఉండేలా ఈ బొమ్మల కొలువు ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ఇందులో రైతులు, గోవులు, కుల వృత్తిదారులు.. ఇలా పల్లెదనం ఉట్టిపడేలా ప్రతి ఒక్క అంశాన్ని పొందుపరిచామన్నారు.

# ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, తదితరులు



భోగి మంట వద్ద ఎంపీ జీవీఎల్ నరసింహారావు



ఎంవీపీ కాలనీలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న విజయరాజేంద్ర, తదితరులు

మద్దిలపాలెం: సంప్రదాయాలకు ప్రతీకలు రంగవల్లులని, వాటిని మహిళలు ఇంటి ముందు వేసి లక్ష్మీదేవిని ఆహ్వానించడం మన సనాతన సంప్రదాయంగా వస్తుందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో పాటు, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విజయనిర్మల, కల్యాణి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు.

**విజేతలకు నగదు బహుమతులు**

ముగ్గుల పోటీలో 200 మంది పాల్గొన్నారని మొల్లి అప్పారావు తెలిపారు. ఆవాల లావణ్యకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ బహుమతి గొర్లె రూపకు రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందించామన్నారు. వీరితో పాటు మరో ఏడుగురికి రూ.2వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 23, 15వ వార్డుల ఇన్‌చార్జీలు గుడ్ల సత్యారెడ్డి, అప్పారి గిరిబాబు, పార్టీ నాయకులు నల్ల కృపాజ్యోతి, చొల్లంగి నాగేశ్వరరావు, పోల రత్నం, మీసాల ప్రదీప్, చింతా వెంకటరావు, జోగారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: బీచ్ రోడ్డులో నివాసం ఉంటున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఇంటి వద్ద గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హరిదాసు, గంగిరెద్దుల ప్రదర్శనలు జరిగాయి. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాయి. అనంతరం జరిగిన క్రీడా పోటీల్లో విజేతలకు కరస్పాండెంట్ విజయరాజేంద్ర బహుమతులు అందజేశారు.

# రోడ్డు భద్రతపై అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ఆరీఫుల్లా

మద్దిలపాలెం: సురక్షిత ప్రయాణంతో గమ్యాన్ని చేరుకుని సంక్రాంతి సంబరాలను జరుపుకోవాలని రెడ్‌ఎఫ్ 93.5 అవగాహన కార్యక్రమం చేపట్టింది. మద్దిలపాలెం ట్రాఫిక్ సిగ్నల్ అవుట్ పోస్టు వద్ద గురువారం జరిగిన కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఏడీసీపీ ఆరీఫుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలతో పాటు, సురక్షిత ప్రయాణానికి రెడ్ ఎఫ్ఎం ఆర్జేలు బాబాయ్, అబ్బాయి రోహిత్, షర్మిల ఆట పాటలతో సందేశాలు ఇచ్చారు.

# క్షణికావేశంతోనే ఆత్మహత్యలు

మహారాణిపేట: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, వీటిని నిరోధించడానికి సూసైడ్ ప్రివెన్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రముఖ మానసిక వైద్యుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బుష్ కాపూరు అన్నారు. గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్‌లో పాల్గొనడానికి వచ్చిన ఆయన గురువారం కేజీహెచ్ ఓపీ గేటు సమీపంలో ఉన్న వైద్యుల ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఆత్మహత్య ఆలోచన ఉన్నవారితో మాట్లాడితే కొంత వరకు వీటిని నివారించవచ్చన్నారు.



# తీరంలో లంగరు



విశాఖ తీరంలో కోస్టుగార్డు నౌకలు మోహరించి కనువిందు చేశాయి. సంద్రంలో వరుసుగా లంగరు వేసి ఉన్న ఈ నౌకలను చూసి సందర్శకులు సంబరపడ్డారు. ఫొటోలు తీసుకుని మురిసిపోయారు.

– సాక్షి, విశాఖపట్నం